# స్టేట్ & సబార్డినేట్ సర్వీస్ రూల్సు - 1996

రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యమునగల గజిటెడ్, నాన్ గజిటెడ్ పోస్టులకు సంబంధించి డిపార్టుమెంట్ల వారీగా వేర్వేరు సర్వీసు నిబంధనలు గలవు. వాటన్నిటికి వర్తించెడి సాధారణ నిబంధనలు, ప్రత్యేక నిబంధనలు, తాత్కాలిక నిబంధనలు స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీసు రూల్స్ - 1996 పేరున జిఓ.ఎంఎస్.నం. 436 జిఏడి తేది. 15.10.1996(అధ్యాపక దర్శిని-15) ద్వారా ఇవ్వబడినవి.

ఉద్యోగుల సర్వీసుకు సంబంధించి సాధారణంగా వాడబడెడి - క్యాడర్, డ్యూటీ, రెగ్యులర్ అపాయింట్ మెంట్, ప్యానల్, ప్రొబేషన్, అప్రూవ్డ్ క్యాండిండేట్, సర్వీస్ మున్నగు పదముల నిర్వచనములు రూలు-2 నందు ఇవ్వబడినవి.

**నియామకము :** ఆయా ప్రభుత్వ సర్వీసు లందు నియామకము 4 విధములుగా జరుగును. అవి 1) క్రొత్తవారిని ఎంపికచేసి, నియమించు "డైరెక్ట్ రిక్రూట్‌మెంట్" 2) ఇతర సర్వీసు లేక అదే సర్వీసుకు చెందిన మరొక సమాన స్థాయి పోస్టు నుండి నియమించు రిక్రూట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ 3) ప్రమోషన్ 4) కాంట్రాక్టు అగ్రిమెంటు పద్ధతిపై నియామకము.

నియమ నిబంధనలన్నిటిని పాటించి నియమించుట ఆలస్యమునకు కారణమగు సందర్భములో ప్రజా ప్రయోజనాల రీత్యా నియామకాధికారి ఒక వ్యక్తిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించవచ్చును. (రూలు 10). ఒకే సర్వీసుకు చెందిన ఒక క్యాటగిరి నుండి వేరొక క్యాటగిరికి ప్రమోషన్ పొందవలెనన్నను, ఒక సర్వీసు నుండి మరియొక సర్వీసునకు బదిలీపై నియామకము పొందవలెనన్నను ఉద్యోగి తాను ప్రస్తుతము పని చేయుచున్న క్యాడరునందు ప్రొబేషన్‌ను పూర్తిచేసియుండాలి. (రూలు 8)

**డైరెక్టు రిక్రూట్‌మెంట్ అర్హతలు :** ఎ) మంచి ఆరోగ్యము, అలవాట్లు గలిగి, సంబంధిత పోస్టులో పని చేయుటకు తగిన శారీరక దారుఢ్యము కలిగి వుండాలి. బి) మంచి నడవడి, ప్రవర్తన కలిగియున్నట్లు నివేదిక వుండాలి.సి) పోస్టుకు అవసరమైన విద్య, ఇతర అర్హతలు కలిగి వుండాలి. డి) నిర్ణీత వయోపరిమితి కలిగి వుండాలి.(రూలు 12)

**ప్యానల్ లిస్టు తయారు :** ఆం.ప్ర. పబ్లిక్ సర్వీసు కమీషన్ పరిధిలోని పోస్టుల విషయములో స్క్రీనింగ్ కమిటీతోను, పబ్లిక్ సర్వీసు కమీషన్‌తో సంబంధంలేని పోస్టుల విషయంలో డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డిపిసి)తోను సంప్రదించిన మీదట నియామక అధికారి అప్రూవ్డ్ క్యాండిడేట్స్ ప్యానల్‌ను తయారు చేయును. రానున్న సంవత్సరం ఆగస్టు 31 వరకు ఏర్పడు ఖాళీలకై 1:3 నిష్పత్తిలో అర్హులైన వారి ప్యానల్ తయారు చేయబడును. (రూలు 6)

**విధులలో చేరుటకు గడువు :** డైరెక్ట్ రిక్రూట్మెంట్ క్రింద నియమించబడినవారు నియామక ఉత్తర్వులు రిజిష్టరు పోస్టు ద్వారా పంపబడిన తేదీ నుండి 30 రోజులలోగా విధులలో చేరాలి. ప్రమోషన్‌పై నియమించబడిన వారు ఉత్తర్వులు అందిన 15 రోజులలోగా విధులలో చేరాలి. అట్లు 15 రోజులలో విధులలో చేరని వారు మరుసటి సంవత్సరం ప్రమోషన్ ప్యానల్‌లో చేర్చబడతారు. (జిఓ 145 జిఏడి, తేది. 15.06.2004)

**సెలక్షన్ లిస్టు :** నియామకముపై రూలు-22లో ఇవ్వబడిన రోస్టర్ పాయింట్ల ప్రకారము సెలక్షన్ లిస్ట్ (మెరిట్-కం-కమ్యునల్ రోస్టర్) తయారు చేయబడును. పూర్తి వివరములు ప్రక్క పేజీలో ఇవ్వబడినవి.

**టెస్టులు :** ఎ) ప్రొబేషన్ పీరియడు పూర్తగులోగా తెలుగుభాషా పరీక్ష పాస్ కావాలి. అయితే ఎస్ఎస్‌సి లేక తత్సమాన పరీక్షను తెలుగు మాధ్యమంగా పాసయిన వారికి మరియు 45 సంవత్సరముల వయస్సు నిండినవారికి మినహాయింపు వున్నది. (రూలు 13 & 14)

బి) క్రొత్తగా నిర్ధేశించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలను ప్రొబేషన్‌ను పీరియడులోగా లేక ప్రమోషను పొందిన తదుపరి నిర్వహించబడిన రెండు పరీక్షల కాలములోగా, ఏది తర్వాత అయితే దానిలోగా పాస్‌కావాలి. (రూలు 15)

**సీనియార్టీ :** ఒక ఉద్యోగి సీనియార్టీ అతడు ఉద్యోగములో చేరిన తేదీ నుండి లెక్కించబడుతుంది. (రూలు 33ఎ) అయితే నియామకముల నిమిత్తము నియామకాధికారి అభ్యర్థుల జాబితా తయారు చేసి వున్నచో సదరు జాబితాలోని క్రమము ప్రాతిపదికగా అతని సీనియార్టీ నిర్ణయించబడుతుంది. (రూలు 33బి)

**ప్రొబేషన్ పిరియడ్ :** డైరెక్ట్ రిక్రూట్మెంట్ వారి విషయములో నియామకపు తేదీ నుండి మూడు సంవత్సరాల అవిచ్ఛిన్న కాలములో 2 సంవత్సరములు, ప్రమోషన్‌పై నియామకము పొందిన వారి విషయములో 2 సంవత్సరముల అవిచ్ఛిన్న కాలములో 1 సంవత్సరము సర్వీసు ప్రొబేషన్ పిరియడ్‌గా పరిగణించబడుతుంది. (రూలు 16) - సమర్థవంతంగా పనిచేసినట్లు ప్రొబేషన్ డిక్లరేషన్ జరిగితే అట్టి ఉద్యోగి సర్వీసులో స్థిర పరచబడును. (రూలు 21)

# అపాయింట్‌మెంట్స్ - కమ్యునల్ రోస్టర్

స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్సు'లోని రూలు-22 ప్రకారం ఉద్యోగ నియామకాలలో కొన్ని జాతులు / తరగతుల వారికి రిజర్వేషన్ కలదు. అల్లే జిఓ.ఎంఎస్.నం. 99 జిఏడి, తేది. 08.03.1996 ద్వారా ఉద్యోగ నియామకాలలో స్త్రీలకు 33 1/3 శాతం రిజర్వేషన్ కల్పించబడినది.

జిఓ.ఎంఎస్.నం. 65 జిఏడి, తేది. 15.02.1997 ప్రకారం సుపీరియర్ సర్వీసుకు చెందిన ప్రతి వంద పాయింట్ల రోస్టరులో కేటాయింపులు, రిజర్వేషనులు క్రింది విధంగా వుంటాయి.

| వర్గము | జనరల్ | | మహిళలు | |
|---|---|---|---|---|
| ఓపెన్ కాంపెటిషన్ | 3, 5, 9, 11, 13, 15, 21, 26, 28, 31, 32, 36, 37,40, 42, 46, 48, 51, 53, 56, 57, 61, 63, 67, 73, 76, 80, 82, 86, 88, 92, 98, 100 | మొత్తం-33 | 1,6, 12, 17, 23, 30, 34, 38, 50, 55, 59, 65, 71, 78, 84, 90, 96 | మొత్తం-17 |
| షెడ్యూలు కులములు | 7,16,27,41,52, 62, 72,77,91,97 | మొత్తం-10 | 2,22,47,66,87 | మొత్తం-5 |
| షెడ్యూల్డ్ తరగతులు వెనుకబడిన తరగతులు | 25, 33, 75, 83 | మొత్తం-4 | 8, 58 | మొత్తం-2 |
| గ్రూప్-ఎ | 20, 29, 54, 70, 79 | మొత్తం-5 | 4,45 | మొత్తం-2 |
| గ్రూప్-బి | 24, 35, 60, 74, 85, 95 | మొత్తం-6 | 10,49,81,99 | మొత్తం-4 |
| గ్రూప్-సి | 14 | మొత్తం-1 | | |
| గ్రూప్-డి | 39, 43, 68, 89, 93 | మొత్తం-5 | 18, 64 | మొత్తం-2 |
| గ్రూప్-ఇ | 44, 69 | మొత్తం-2 | 19, 94 | మొత్తం-2 |

**ముఖ్యాంశాలు :**

1. పై వానిలో 12,37 పాయింట్లు మాజీ సైనికోద్యోగులకు కేటాయించబడినవి. వారు లేనిచో ఖాళీలు కొనసాగుతాయి. ప్రత్యేక నియామక ప్రక్రియ ద్వారా వాటిని భర్తీ చేస్తారు. అదే విధంగా 6,31,56 పాయింట్లు వికలాంగులకు కేటాయించబడతాయి. వారు లభించనప్పుడు యీ కేటాయింపు 3 సం॥ల వరకు కొనసాగించబడుతుంది. అటుపై అది ఓపెన్ కాంపెటిషన్‌కు చెందుతుంది.
2. ప్రతి 3వ సైకిల్‌లోని 14వ పాయింట్ బిసి (సి) మహిళకు కేటాయించబడుతుంది.
3. పై 100 పాయింట్ల రోస్టరు ప్రతి కేడరుకు వేర్వేరుగా వర్తిస్తుంది. తగిన అభ్యర్థిని మెరిట్ లిస్టు నుండి ఎంపిక చేసి రోస్టర్ పాయింట్లను క్రమపద్ధతిలో నింపాలి. (మెమో.నం. 42005/సర్వీస్-డి/2002 జిఏడి తేది. 18.09.2002)
4. లోకల్ మరియు నాన్ లోకల్‌తో కూడిన 'ఓపెన్ క్యాటగిరి' క్రింద మొత్తం ఖాళీలలో 20% కేటాయించగా మిగిలిన 80% లోకల్ అభ్యర్థులకు కేటాయించడం జరుగుతుంది.
5. ఒక రిక్రూట్మెంట్‌లో జరిగిన నియామకాలలో చివరి రోస్టర్ పాయింట్ తదుపరి పాయింట్ నుండి మరొక రిక్రూట్మెంట్‌కై సెలక్షన్ లిస్టు తయారు చేయబడుతుంది.
6. ఓపెన్ కాం పిటిషన్‌కు షెడ్యూల్డ్ కులాలు, జాతులు, వెనుకబడిన తరగతుల వారిని కూడా పరిగణనలోనికి తీసుకొంటారు.
7. షెడ్యూల్డ్ కులాల, జాతుల, వెనుకబడిన తరగతుల వారికి కేటాయించబడిన ఖాళీలను వారితోనే నింపాలి. వారిలో అర్హులైన అభ్యర్థులు లేనప్పుడు ఖాళీలు అల్లే కొనసాగుతాయి. అయితే ప్రభుత్వ అనుమతితో ఓపెన్ కాంపిటీషన్ అభ్యర్థులకు వాటిని కేటాయించవచ్చును. అందుకు సమానమైన ఖాళీలను తదుపరి నియామకములో వారికి కేటాయించాలి.
8. వెనుకబడిన తరగతులు మరియు షెడ్యూలు కులములలోని ఒక గ్రూపులో తగిన అభ్యర్థి లేనప్పుడు ఆ ఖాళీలను ఇతర గ్రూపులకు చెందిన వారితో నింపవచ్చును.
9. నియామక ఉత్తర్వులు యిచ్చినను, అభ్యర్థి ఆ ఉద్యోగములో చేరనప్పుడు, రోస్టరులోని ఆ పాయింటు ఖాళీగానే వున్నట్లు పరిగణించబడుతుంది.

**ప్రమోషన్స్‌లో రిజర్వేషన్ :** 14.02.2003 నుండి ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రమోషన్స్‌లో కూడ రిజర్వేషన్ సౌకర్యం. జి.ఓ. 5 ద్వారా కల్పించబడినది. ఒక క్యాడరులోని పోస్టుల సంఖ్య 5కంటే ఎక్కువగా వున్నప్పుడు పైన చూపిన విధంగా రిజర్వేషన్ వర్తిస్తుంది. సీనియార్టీ పాటించుటవలనగాని, సీనియార్టీతో సంబంధం లేకుండా రిజర్వుడు రోస్టర్ పాయింట్ల వద్దకు సర్దుబాటు చేయుటవలనగాని రిజర్వేషన్ శాతము పూర్తయితే ఆ తర్వాత వున్న పాయింట్లకు రిజర్వేషన్ వర్తించదు. రిజర్వేషన్ శాతము ప్రకారము పోస్టుల సంఖ్యను నిర్ణయించినప్పుడు భాగ ఫలము 0.5గాని అంతకు మించిగాని వున్న యెడల తదుపరి సంఖ్యకు సవరించబడును. వికలాంగులకు జి.ఓ.నం.42 తేది. 19.10.2011 ద్వారా ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించడినది. 6,31,56 రోస్టర్ పాయింట్ వర్తిస్తాయి. పై కండిషన్సు వీరికి కూడ వర్తిస్తాయి.

# కారుణ్య నియామకాలు

మరణించిన ప్రభుత్వోద్యోగి యొక్క ఆధారితులకు జిఓ 687 జిఏడి, తేది. 03.10.1977 ద్వారా కారుణ్య నియామక సౌకర్యము కల్పించబడినది. కాలక్రమంలో దీనిపై పలు సవరణలు, వివరణలు ఇవ్వబడినవి. వాటన్నిటిని చేర్చి మెమో నం. 60681/సర్వీస్-ఎ/2003-1 జిఏడి తేది. 12.08.2003 ద్వారా సమగ్ర ఉత్తర్వులు యివ్వబడినవి.

వైద్య కారణములపై రిటైరైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు జిఓ.ఎంఎస్.నం. 661 జిఏడి తేది. 23.10.2008 ద్వారా పునరుద్ధరించబడింది.

**కారుణ్య నియామకాలకు అర్హులైన వారు :** 1) మరణించిన లేక 2) గడిచిన 7 సం॥ల పైగా కనిపించకుండా పోయిన లేక 3) వైద్య కారణములపై రిటైర్మెంట్‌కు అనుమతించబడిన తేదీ నుండి 5 సం॥ల సర్వీసుగల ఉద్యోగి కుటుంబములో సంపాదనా పరులెవ్వరు లేనప్పుడు ఆ కుటుంబములో ఒకరు నియామకమునకు అర్హులు. ఉద్యోగి కనిపించకుండా పోయిన సందర్భంలో పోలీసు రిపోర్టు అధారంగా, సంబంధిత ప్రభుత్వ శాఖ కార్యదర్శి అనుమతితో కారుణ్య నియామకం ఇవ్వబడుతుంది.

సర్వీస్‌లో మరణించిన ఎయిడెడ్ టీచర్ల వారసులకు జిల్లా యూనిట్‌గా కారుణ్య నియామకాలు జిఓ.ఎంఎస్.నం. 113 విద్య, తేది. 06.10.2009 ద్వారా అనుమతించబడినవి.

**ఆధారిత కుటుంబ సభ్యులు :** 1) ఉద్యోగి భార్యలేక భర్త 2) కుమారుడు లేక కుమార్తె 3) ఉద్యోగి మరణించిన నాటికి 5 సం॥ల ముందు చట్టబద్ధంగా దత్తత తీసుకొనబడిన కుమారుడు లేక కుమార్తె 4) ఉద్యోగి భార్య / భర్త నియామకమునకు ఇష్టపడని సందర్భములో ఆ కుటుంబముపై ఆధారితురాలైన వివాహిత కుమార్తె 5) మరణించిన ఉద్యోగికి - ఒక వివాహిత కుమార్తె, మరియొక మైనర్ కుమార్తె వున్న సందర్భములో వారి తల్లిచే సూచించబడిన ఒకరు 6) ఉద్యోగి అవివాహితుడై మరణించినప్పుడు అతని తమ్ముడు లేక చెల్లెలు కారుణ్య నియామకమునకు అర్హులు. కారుణ్య నియామకము పొందిన తదుపరి పునర్వివాహం చేసుకొన్నను ఉద్యోగంలో కొనసాగుతారు.

**నియమించబడెడి పోస్టు స్థాయి :** జూనియర్ అసిస్టెంట్ పోస్టునకుగాని, ఆ పోస్టు యొక్క స్కేలుకు మించని పోస్టుకుగాని, అంతకంటే తక్కువ స్థాయి పోస్టుకుగాని కారుణ్య నియామకము ఇవ్వబడును.

**నియామకపు విధానము :** సాధారణ నియామక విధానముతో సంబంధము లేకనే కారుణ్య నియామకములు చేయబడతాయి. ప్రభుత్వ ఉద్యోగి మరణించిన సంవత్సరంలోగా అతని కుటుంబ సభ్యుడు నియామకము కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. మైనర్ పిల్లలకు ఉద్యోగి మరణించిన 2 సంవత్సరములోగా 18 సంవత్సరముల వయస్సు నిండినప్పుడు మాత్రమే వారి దరఖాస్తు పరిగణించబడుతుంది. సాధారణ నియామకములపై విధించబడెడి నిషేధము యీ నియామకములకు వర్తించదు.

వైద్య కారణములపై రిటైర్మెంట్ కోరుకొనే వారి దరఖాస్తు జిల్లా / రాష్ట్ర వైద్యుల కమిటీకి పంపి వారి నివేదిక ఆధారంగా జిల్లా / రాష్ట్ర కమిటీ సిఫార్సు మేరకు నియామకాధికారి అనుమతిస్తారు.

**అర్హతలు :** 1) ఆయా పోస్టులకు సంబంధించిన నిర్ణీత విద్యార్హతలను కలిగి వుండాలి. అయితే జూనియర్ అసిస్టెంట్‌గా సబార్డినెట్ ఆఫీసులలో నియామక అర్హతైన ఇంటర్మీడియేట్ పాసగుటకు 3 సం॥ల గడువు, శాఖాధిపతి కార్యాలయము లేక సచివాలయము అయినచో నియామక అర్హతైన డిగ్రీ పాసగుటకు 5 సం॥ల గడువు అనుమతించబడుతుంది. గడువులోగా కావలసిన అర్హత వర్తిస్తుంది. అయితే ఎస్‌సి, ఎస్‌టి, బిసి తరగతులకు చెందినవారికి 5 సం॥ల మినహాయింపు వున్నది. ఉద్యోగి భార్య / భర్తకు కారుణ్య నియామకము ఇవ్వవలసిన సందర్భములో గరిష్ఠ వయోపరిమితి 45 సం॥ల. 3) చివరి శ్రేణి పోస్టులకు వయస్సు, అర్హతలు తగిన విధంగా లేనప్పుడు ముందు నియామకమును యిచ్చి ఆ తదుపరి మినహాయింపును సంబంధిత శాఖ నుండి పొందవచ్చును.

**నియామక పరిధి :** మరణించిన ఉద్యోగి పనిచేసిన యూనిట్‌లో నియామకము ఇవ్వబడుతుంది. ఆ యూనిట్‌లో ఖాళీ లేనప్పుడు ఆ కేసులను నోడల్ అధికారియైన జిల్లా కలెక్టరుకు పంపినచో వారు ఇతర ఏ డిపార్టుమెంట్లకైనను కేటాయించెదరు. ఏ డిపార్టుమెంటులోను, ఖాళీలు లేని సందర్భములో కలెక్టరు ఒక క్యాలెండరు సంవత్సరంలో 5 వరకు సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించవచ్చును. అంతకుమించి పోస్టులు అవసరమయినప్పుడు సంబంధిత శాఖకు ప్రతిపాదనలు పంపబడతాయి. ఈ కారుణ్య నియమకాలు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాలో సిక్స్ పాయింట్ ఫార్ములాకు లోబడి యివ్వబడతాయి. అట్లే రిజర్వేషన్ నిబంధన (రూలు 22)ను పాటించవలసి వుంటుంది. మరణించిన ఉద్యోగి భార్య కారుణ్య నియామమునకు దరఖాస్తు చేస్తే ఆమె స్వంత జిల్లాలోగాని, భర్త ఉద్యోగము చేసిన చోటగాని, ఏ ఇతర జిల్లాలో గాని నియామకాన్ని కోరుకోవచ్చు.

**ఎక్స్‌గ్రేషియా చెల్లింపు :** కారుణ్య నియామకమయి ఇచ్చుట సాధ్యపడని సందర్భంలో నాలుగవ తరగతి ఉద్యోగుల కుటుంబములకు రూ. 40,000/- నాన్-గజిటెడ్ వారికి రూ. 60,000/- గజిటెడ్ వారికి రూ. 80,000/- ఎక్స్‌గ్రేషియా చెల్లించబడుతుంది.

# ఉపాధ్యాయుల సర్వీసు - అధికారాల బదలాయింపు

## G.O.Ms.NO. 40 Edn. Dt. 7.5.2002

ఉపాధ్యాయుల సర్వీసు, సౌకర్యాల అమలుకు సంబంధించిన ఎక్కువ అధికారాలు జిల్లా అధికారుల వద్ద కేంద్రీకృతమై వుండటం వల్ల ఉపాధ్యాయులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటూ వుండేవారు. జిల్లా విద్యాశాఖాధికారులకు కూడా యీ బాధ్యతలు ఎక్కువ కావడం వలన విద్యా విషయక అంశాలపై దృష్టి పెట్టలేకపోతుండేవారు. అందుచే అధికారాలను వికేంద్రీకరించడం బహుళ ప్రయోజనకరంగా వుంటుందని ఉపాధ్యాయ ఉద్యమం కోరుతూ వచ్చింది. అందుకు అనుగుణంగా జిఓ 40 విద్య, తేది. 07.05.2002 ద్వారా కొన్ని అధికారాలు ప్రధానోపాధ్యాయులకు, ఇతర విద్యాశాఖ అధికారులకు బదలాయించబడినవి.

### అధికారులు - అధికారాలు

**ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు :** తమ పాఠశాల ఉపాధ్యాయులకు సాధారణ మరియు ప్రత్యేక క్యాజువల్ సెలవులను మంజూరు చేస్తారు.

**ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు :** తమ పాఠశాల ఉపాధ్యాయులకు సాధారణ మరియు ప్రత్యేక క్యాజువల్ సెలవులను మంజూరు చేస్తారు. 7వ తరగతి విద్యార్థులకు తగ్గిన వయస్సును కండోన్ చేస్తారు. విద్యార్థుల మాధ్యమములను చదువుతున్న భాషలను మార్పు చేస్తారు. ఇతర సిలబస్‌లకు చెందిన విద్యార్థులను చేర్చుకొంటారు. విద్యార్థులకు తగ్గిన హాజరును కండోన్ చేస్తారు.

**ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు :** తమ పాఠశాల ఉపాధ్యాయులకు అన్ని రకముల సెలవులను, వార్షిక ఇంక్రిమెంట్లను, వేతన స్థిరీకరణలను, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీము స్కేళ్ళను, ఎల్‌టిసి, జాయినింగ్ పర్మిషన్‌ను మంజూరు చేస్తారు. అప్రెంటిస్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేల్సును, జిపిఎఫ్ లోన్స్‌ను మరియు పార్ట్ ఫైనల్స్‌ను, ఎఫ్‌బిఎఫ్ మరియు జిఐఎస్ మొత్తములను, పెన్షన్ మరియు గ్రాట్యూటీలను మంజూరు చేస్తారు. జిపిఎఫ్ ఫైనల్ విత్‌డ్రాయల్స్‌ను (జడ్.పి/ఎ.జిలకు), పెన్షన్ ప్రతిపాదనలను ఎజికి, ఎపిజిఎల్ఐ దరఖాస్తులను పై అధికారులకు పంపిస్తారు. పాఠశాల విద్యా డైరెక్టరు గారిచే మంజూరు చేయబడిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ / అడ్వాన్సులను డ్రా చేసి చెల్లిస్తారు. 7&10 తరగతుల విద్యార్థులకు తగ్గిన వయసును కండోన్ చేస్తారు. అట్లే విద్యార్థులకు తగ్గిన హాజరును కండోన్ చేస్తారు. విద్యార్థుల మాధ్యమములను, చదువుచున్న భాషలను మార్పు చేస్తారు. ఇతర సిలబస్‌లకు చెందిన విద్యార్థులను చేర్చుకొంటారు.

**మండల విద్యాశాఖాధికారులు/డిప్యూటీ ఇన్స్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ :** వీరు ప్రాథమిక / ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు సంబంధించి అధికారము కలిగియుందురు. ప్రధానోపాధ్యాయులకు క్యాజువల్ మరియు స్పెషల్ క్యాజువల్ సెలవులను మంజూరు చేస్తారు. ప్రధానోపాధ్యాయులకు మరియు ఉపాధ్యాయులకు అన్ని రకముల అర్థవేతన సెలవులను, వార్షిక ఇంక్రిమెంట్లను, వేతన స్థిరీకరణలను, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీము స్కేళ్ళను, జాయినింగ్ పర్మిషన్‌ను, ఎల్‌టిసిని మంజూరు చేస్తారు. అప్రెంటిస్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేల్సును, జిపిఎఫ్ లోన్స్‌ను మరియు పార్ట్ ఫైనల్స్‌ను ఎఫ్‌బిఎఫ్ మరియు జిఐఎస్ మొత్తములను, పెన్షన్ మరియు గ్రాట్యూటీలను మంజూరు చేస్తారు. జిపిఎఫ్ ఫైనల్ విత్‌డ్రాయల్స్‌ను (జడ్‌పి / ఎజిలకు), పెన్షన్ ప్రతిపాదనలను ఎజికి, ఎపిజిఎల్ఐ దరఖాస్తులను పై అధికారులకు పంపిస్తారు. పాఠశాల విద్యా డైరెక్టరు గారిచే మంజూరు చేయబడిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ / అడ్వాన్స్‌లను డ్రాచేసి చెల్లిస్తారు.

**ఉప విద్యాశాధికారులు :** ప్రాథమిక / ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సంబంధించి మండల విద్యాశాఖాధికారులు కలిగి వుండే అధికారములన్నిటిని వీరు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సంబంధించి కలిగి ఉంటారు. దానితోపాటు ఇతర రాష్ట్రములలో చదువదలచిన విద్యార్థుల టిసిలను అటెస్ట్ చేస్తారు.

**జిల్లా విద్యాశాఖాధికారులు :** ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సంబంధించి ఉప విద్యాశాఖాధికారులు కలిగి వుండే అధికారములన్నిటిని వీరు ఎంఇఓ / డెప్యూటీ ఐఓఎస్‌లకు సంబంధించి కలిగి వుంటారు. వీరితోపాటు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సంబంధించి సిసిఏ రూల్సు ననుసరించి మైనర్ శిక్షలు విధించే అధికారము కలిగి వుంటారు. ప్రాథమిక / ప్రాథమికోన్నత / ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల యొక్క సర్వీసు రెగ్యులరైజేషన్ మరియు ప్రొబేషన్ డిక్లరేషన్ చేస్తారు. ఇతర దేశాలలో చదువదలచిన విద్యార్థుల టిసిలను అటెస్ట్ చేస్తారు.

**గమనిక :** జిఓ.ఎంఎస్.నం. 70 విద్య, తేది. 06.07.2009 ప్రకారం క్యాజువలేతర / స్పెషల్ క్యాజువలేతర సెలవులు 4 నెలల వరకు ప్రాథమిక / ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారి, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సంబంధిత ప్రధానోపాధ్యాయుడు మంజూరు అధికారిగా ఉంటారు. 4 నెలల పైబడి 6 నెలల వరకు ఉపవిద్యాశాఖాధికారి, 6 నెలల నుండి 1 సంవత్సర వరకు జిల్లా విద్యాశాఖాధికారి, 1 సంవత్సరం నుండి 4 సం॥ వరకు సెలవును మంజూరు చేసే అధికారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కలిగి ఉంటారు. అయితే ప్రసూతి సెలవు మంజూరు అధికారం ప్రాథమిక / ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ఎంఇఓ, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుడు కలిగి ఉంటారు. (జిఓ 84 విద్య, తేది. 17.09.2012)